epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 97 | బుధవారం | 21.08.2024



# రామప్ప.. ఓ అద్భుతం

- పర్యాటక ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం
- మంత్రి జూపల్లి కృష్ణారావు

**ములుగు, మన చౌరాస్తా :** ములుగు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని అన్ని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తుందని, జిల్లాలోని కాకతీయ కట్టడాలు అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకుంటున్నాయని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రానున్న రోజులలో ములుగు జిల్లా పర్యాటక ప్రాంతంగా మారిపోతుందని అభిప్రాయపడ్డారు. మంగళవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుతో కలిసి వెంకటాపూర్ మండలంలోని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన రామప్ప ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎనమిది వందల సంవత్సరాల క్రితం నిర్మించిన రామప్ప ఆలయం నేటికి చెక్కుచెదరకుండా ఉందని, అప్పటి కాకతీయులు వారి మేధస్సును వినియోగించి భారీ రాయిలతో శిల్పాలను చెక్కి అద్భుతంగా అమర్చారని, ఇలాంటి కట్టడాలు నేటి సమయంలో కట్టను ఎవరి తరం కాదన్నారు.



ఇక్కడి ప్రాంతంలో పర్యటించే పర్యాటకులకు కనీస వసతులు కల్పించాలన్న ఉద్దేశంతో చర్యలు తీసుకుంటున్నామని, రామప్ప సరస్సులో నీరు సమృద్ధిగా ఉండటం సంతోషకరమని అన్నారు. ప్రతి నెలలో ఎమ్మెల్యే లు, మంత్రులు ఒక్కసారైనా పర్యాటక ప్రాంతాల్లో పర్యటించాలని దీంతో మానసిక ఉల్లాసానికి దోహదపడుతుందని అన్నారు. ఇక్కడి పర్యాటక ప్రాంతాలను జాతీయ అంతర్జాతీయ గుర్తింపు పొందడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ రూ.90 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టాలని జిల్లా యంత్రాంగం ద్వారా



మంత్రికి నివేదిక సమర్పించడం జరిగిందని, 14 సంవత్సరాల క్రితం లక్నవరంలో ఉయ్యాల వంతెన ఏర్పాటు చేయడంతో పర్యాటకులను అత్యధికంగా ఆకర్షిస్తుందని అదే తరహాలో రామప్ప సరస్సులో ఉయ్యాల వంతెన ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. రామప్ప ప్రాంతంలో ప్రసాద్ పథకం ద్వారా పనులు కొనసాగుతున్నాయని, గోదావరి పరిహక ప్రాంతాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తే పర్యాటకులను ఆకర్షించే అవకాశం ఉందని అన్నారు. జిల్లాలోని రామప్ప, లక్నవరం సరస్సులు ఉండగా, మేడారంలోని శ్రీసమ్మక్క సారలమ్మ ప్రాంతంలో స్మృతి వనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, పర్యాటక శాఖ అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి, కలెక్టర్ దివాకర టి.ఎస్ , ఎస్పీ షభరిష్, డీఎఫ్వో రాహూల్ కిషన్ జాదవ్, ఆర్డీవో కే.సత్యపాల్ రెడ్డి, కేంద్ర, రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులు పాల్గొన్నారు.



## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

2

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



## తాగునీటికి ఇబ్బందులు రావొద్దు

2

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా



## రైతులను రుణ విముక్తులను చేయండి

3

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

General News



# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- రెవెన్యూ యాక్ట్‌పై అభిప్రాయాలు సేకరించాలి
- పెండింగ్ ఎల్ఆర్ఎస్, ధరణి వెంటనే దరఖాస్తులను పరిష్కరించాలి
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**జనగామ, మన చౌరాస్తా :** రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రానున్న ఐదు రోజుల్లో అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున కలెక్టర్లు, జిల్లా అధికారులందరూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ప్రజలు, పాఠశాలల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, లోతట్టు ప్రాంతాలను గుర్తించి అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి జిల్లాల కలెక్టర్లతో భారీ, అతి భారీ వర్షాలు, ధరణిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ నేపథ్యంలో జనగామ జిల్లా నుంచి అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేయబోయే రెవెన్యూ యాక్ట్ పై రాష్ట్ర వ్యాప్తంగా 23 లేదా 24వ తేదీల్లో జిల్లా స్థాయిలో మేధావులు, సీనియర్ సిటిజన్స్, సీనియర్ అధికారులతో కన్సల్టేషన్ వర్క్ షాప్ ను నిర్వహించి, వారి అభిప్రాయాలను సేకరించాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎల్ఆర్ఎస్, ధరణి దరఖాస్తులు అధిక శాతం పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిశీలించి అర్హత గల దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనల మేరకు ఆమోదించాలన్నారు. ప్రత్యేక బృందాలను నియమించి రెవెన్యూ, మున్సిపల్, టౌన్ ప్లానింగ్, సంబంధిత సిబ్బంది ద్వారా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి, సరైన వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని మంత్రి కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమావేశం నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చే ఐదు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకుండా అధికార యంత్రాంగమంతా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ పై ఆర్ఐలు, ఎంపీఓలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని, ఈ నెల 23న మేధావులు, తహసీల్దార్ లు, ఆర్డీఓలు, సీనియర్ అధికారులతో రెవెన్యూ యాక్ట్ పై కన్సల్టేషన్ వర్క్ షాప్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ధరణి దరఖాస్తుల్లో వివిధ మాడ్యూల్స్ (డేటా కరెక్షన్స్, సక్సెషన్, మ్యుటేషన్, టీఎం 33) లలో పెండింగ్ లో ఉన్న వాటిని వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న, డీపీఓ స్వరూప, జడ్పీ సీఈవో సరిత, డీఆర్డీవో వసంత, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సంబంధిత ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా ప్రజలకు తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. తాగునీటి సరఫరా ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందికి ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని చీటకోడూరు రిజర్వాయర్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ లోని నీటి మట్టం (ఇన్ ఫ్లో) పెరుగుదల వివరాలను సంబంధిత నీటిపారుదల అధికారులను అడిగి తెలుసుకున్నారు. అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి చీటకొడూరు రిజర్వాయర్ కు సరైన విధంగా నీటి పంపిణీ జరుగుతుందని, రోజుకు ఐదు సెంటీమీటర్ల చొప్పున నీటి మట్టం పెరుగుతోందని అధికారులు వివరించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నీటిపారుదల ఈఈ మంగీలాల్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



### చేనేత, టెక్స్ టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సుకు

# దరఖాస్తుల ఆహ్వానం

**జనగామ, మన చౌరాస్తా :** చేనేత, టెక్స్ టైల్ టెక్నాలజీ మూడు సంవత్సరాల కాల పరిమితి గల డిప్లొమా కోర్సులో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. పదో తరగతి లేదా తత్సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులైన వారు అర్హులని, ఈ నెల 31వ తేదీ వరకు పూర్తి చేసిన దరఖాస్తులు ఈ కింది అడ్రస్ కు వ్యక్తిగతంగా గాని, రిజిస్టర్ పోస్టు ద్వారా గాని పంపాలన్నారు. హైదరాబాద్ లోని నాంపల్లిలో చేనేత భవనం, 3వ అంతస్తు లో ఉన్న చేనేత, జౌళి శాఖ, కమిషనర్ వారి కార్యాలయంలో లేదా జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంలో ఉన్న సహాయ సంచాలకులు, చేనేత జౌళి శాఖ, జనగామ వారి కార్యాలయం లో అందచేయాలన్నారు. పూర్తి వివరాల కోసం హిమజ కుమార్, ఓఎస్‌డీ సెల్ నెంబర్ 9030079242 లేదా tsht.telangana.gov.in వెబ్ సైట్ లో సంప్రదించవచ్చునన్నారు.



# సంస్కరణలకు అధ్యుడు రాజీవ్

**చేర్యాల, మన చౌరాస్తా :** మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను మంగళవారం చేర్యాల మండల కేంద్రంలోని గాంధీ సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమ్మూరి మాట్లాడుతూ.. దేశానికి కాంగ్రెస్ పార్టీతోనే స్వేచ్ఛ, సుభిక్ష పరిపాలన వస్తోందని పేర్కొన్నారు. దేశం డిజిటల్ రంగంలో నేడు ముందుకు పోతుందంటే ఆనాడు రాజీవ్ గాంధీ కమ్యూనికేషన్ రంగాన్ని పరిచయం చేసి అభివృద్ధి చేయడమే కారణమన్నారు. దేశాన్ని ముందుకు తీసుకెళ్లడం కోసం వాణిజ్య వ్యాపార రంగాలలో అభివృద్ధి చేసి ప్రజలందరికీ అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. దేశం కోసం ప్రాణన్ని త్యాగం చేసిన నాయకుడన్నారు. ఆయన ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కుక్కల నియంత్రణపై సమావేశం

**చేర్యాల, మన చౌరాస్తా :** మున్సిపల్ పరిధిలో కుక్కల పెరుగుదల నియంత్రణపై మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అదేవిధంగా అంగడి వేలం పాట నిర్వహించిన అనంతరం కమిషనర్ నాగేందర్ వార్డులలో తిరిగి సమస్యలు తెలుకున్నారు. అంగడి బజార్ లో రోడ్డుపై నిలిచిన నీటి విషయంలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాన్ వెజ్ దుకాణదారులు చెత్తను మున్సిపల్ వాహనంలో వేయాలని ఆదేశించారు. స్వచ్ఛ, పచ్చ దనాన్ని అందరు పాటించాలని అన్నారు. సీజనల్ వ్యాదుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో చైర్మన్ స్వరూపారాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, కౌన్సిలర్లు పశ్చిమడ్ల సతీష్, మాంగోలు చంటి, లింగం, మేనేజర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

Local News



# రైతులకు రుణ విముక్తి కల్పించాలి

- రైతు భరోసా నిధులను విడుదల చేయాలి
- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

**జనగామ, మన చౌరాస్తా :** 2014 నుంచి 2023 వరకు ఉన్న రైతులందరికీ పంట రుణాలను మాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య అధ్యక్షత వహించగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర రాష్ట్ర కమిటీ సభ్యులు మాకు కనకారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ మాట్లాడుతూ జిల్లాలో 2014 నుంచి 2023 వరకు రైతుల పంట రుణాలంటిన్ని తక్షణమే మాఫీ చేసి తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిన్ని చిన్ని సాంకేతిక కారణాలను సాకుగా చూపి ప్రభుత్వం రుణమాఫీ నుంచి తప్పించుకోవాలని చూస్తుందని విమర్శించారు. ప్రధానంగా ఆధార్ నెంబరు తప్పులు ఉన్నాయని, బ్యాంక్ అకౌంట్ లో తప్పులు ఉన్నాయని సాంకేతిక సమస్యలు ఉన్నాయని పరిష్కారం చేస్తామని పేరుతో రైతులు ఖాతాలలో రుణమాఫీ డబ్బులు జమ చేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. రైతుల పండించిన అన్ని రకాల పంటలకు ప్రతి క్వింటాకు వెయ్యి రూపాయలు బోనస్ ఇవ్వాలని, రైతు భరోసా నిధులను తక్షణమే విడుదల చేసి రైతులకు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మంగ వీరయ్య, జిల్లా సహాయ కార్యదర్శి రామావత్ మీట్యా నాయక్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సింగారపు రమేష్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు తోటి దేవదానం, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మీర సురేష్ నాయక్, సంఘం జిల్లా కమిటీ సభ్యులు కాసాని పుల్లయ్య, రైతులు కరే రాములు, కర్రే బీరయ్య, వెంకటేష్, రాజకుమార్, అపరాధప రాజు తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ వినతుల పర్యవేక్షణ

**జనగామ, మన చౌరాస్తా :** రైతులు రుణమాఫీపై స్వీకరిస్తున్న వినతులను కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ రఘునాథపల్లి మండలంలోని వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ప్రతి మండలంలో ఒక వ్యవసాయ శాఖ అధికారిని నియమించడం జరిగిందని, రైతులు కలిసి తమ సమస్యను పూర్తిగా వివరించాలన్నారు. రుణమాఫీ లోని సాంకేతిక సమస్యలను పరిశీలిస్తున్నామని, అందువలన రుణమాఫీ రాలేదని ఆందోళన చెందరాదని ధైర్యం చెప్పారు. ప్రతి రైతు యొక్క సమస్యను పరిష్కరించే వరకు రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు.





## చేర్యాలలో రైతు ర్యాలీ

- ప్రభుత్వంపై రైతుల స్పందన చూసి తట్టుకోలేకపోతున్న బీఆర్ఎస్
- జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి

**చేర్యాల, మన చౌరాస్తా:** ఏక కాలంలో రైతు రుణ మాఫీ చేసిన సందర్భంగా చేర్యాల పట్టణంలో మంగళవారం చేపట్టిన రైతు ర్యాలీకి భారీ స్పందన లభించింది. ఈ ర్యాలీలో రైతులు పెద్ద పాల్గొన్నారు. గాంధీ సెంటర్ నుంచి మార్కెట్ యార్డ్ వరకు సాగిన ర్యాలీలో జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఇది చేతల ప్రభుత్వం అని దానిని సీఎం రేవంత్ రెడ్డి నిరూపించారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతులకు న్యాయం జరిగిందని అన్నారు. రైతుల స్పందన చూసి తట్టుకోలేక ప్రతిపక్ష బీఆర్ఎస్ కు మింగుడు పడటం లేదని విమర్శించారు. రానున్న రోజులు రైతులవేనని గతంలో తాను రైతులకు భూములు అమ్ముకోవద్దని చెప్పానని అన్నారు. ఈ ప్రాంతానికి గోదావరి జలాలు తెచ్చింది నేనేనని నాడు ఇక్కడి నుంచి నీటిని తరలించకుండా పోరాటం చేశానని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శ్వేత, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు కొమ్ము రవి, మంచాల చిరంజీవులు, పట్టణ ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీకాంత్‌తో పాటు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## పనుల్లో నాణ్యత పాటించాలి

### అడిషనల్ కలెక్టర్ పింకేశ్ కుమార్

**జనగామ, మన చౌరాస్తా :** పాఠశాలల అభివృద్ధికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న పనులు నాణ్యతతో ఉండాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. మంగళవారం జనగామ మండలంలోని ఓబుల్ కేశ్వపూర్ పంచాయతీలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం పెద్దరామచర్ల గ్రామంలోనూ, మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అంబేడ్కర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రాలకు వేస్తున్న పెయింటింగ్ పనులను పరిశీలించారు. చిత్రాలు ఆకర్షణీయంగా కనిపించాలని, ఆకట్టుకునేలా చిత్రీకరణ చేపట్టి పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఆయన ట జిల్లా విద్యాశాఖ అధికారి రాము, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జయంతి, సీడీపీవో రమాదేవి ఉన్నారు.



## రైతుల జీవితాలతో చెలగాటం

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**దేవరుప్పుల, మన చౌరాస్తా :** రుణ మాఫీ ఎగ్గొట్టి రైతులతో ఈ ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మండిపడ్డారు. దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి గ్రామంలో రైతులు తమకు రుణమాఫీ కాలేదని మంగళవారం చేపట్టిన ధర్నాకు ఎర్రబెల్లి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటగా రైతు రుణమాఫీకి రూ. 49,500 కోట్లు అవసరం అని చెప్పి, మళ్లీ మాట మార్చి కేబినెట్లో రూ.31 వేల కోట్లు సరిపోతాయని చెప్పారన్నారు. ఆ తర్వాత బడ్జెట్లో కేటాయించింది కేవలం రూ.26 వేల కోట్లు మాత్రమేనని వివరించారు. ఇందులో కూడా మూడు విడతల వారీగా చివరగా చేసిన రుణమాఫీ కేవలం రూ. 17 వేల కోట్లు మాత్రమేనని అన్నారు. ఈ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం మాటిమాటికి మాట మార్చి రైతులను మోసం చేస్తుందని అన్నారు. రుణమాఫీ కాక ఆందోళనలో ఉన్న లక్షలాది మంది రైతులకు తాము తమ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. రైతు రుణమాఫీకి ఈ ప్రభుత్వం చేసింది గోరంతా అయితే ప్రకటనలకు ఖర్చు చేసింది కొండంత అని ఎర్రబెల్లి విమర్శించారు. ప్రతీ ఒక్కరైతుకి న్యాయం చేకూర్చేవరకు ఈ పోరాటం ఆగదు అని అన్నారు.





## మహిళలను గౌరవించడం

# నేర్పించండి

### వైరల్‌గా మారిన రేణు దేశాయ్ పోస్ట్

మన చౌరాస్తా, సినిమా : ప్రముఖ నటి, దర్శకురాలు రేణు దేశాయ్ సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ గా ఉంటారు. ఆమె సామాజిక అంశాలపై తరచూ స్పందిస్తూ ఉంటారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల సమస్యలపై తన గళం వినిపిస్తుంటారు. తాజాగా రేణూ దేశాయ్ సోషల్ మీడియాలో షేర్ చేసిన పోస్ట్ ఒకటి నెట్టింట వైరల్ గా మారింది. ఇటీవల కోల్‌కత్తాలోని ఆర్‌జీ కార్ మెడికల్ హాస్పిటల్‌లో ఓ ట్రైనీ డాక్టర్ పై జరిగిన హత్యాచార ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. మరో నిర్భయ ఘటన అంటూ అందరూ రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. సినిమా సెలబ్రిటీలు కూడా ఈ ఘోరంపై స్పందిస్తున్నారు. ఈ నేపథ్యంలో రేణూ దేశాయ్ కూడా కూడా స్పందించారు. ఈ ఘటన జరిగిన రోజు నుంచి సామాజిక మాధ్యమాల్లో ఏదో ఒక పోస్ట్ పెడుతూనే ఉన్నారు. తాజాగా ఇదే ఘటనపై మరో ఆసక్తికర పోస్ట్ పెట్టారు రేణు దేశాయ్. 'మీ కొడుకుకు మహిళలను ఎలా గౌరవించాలో నేర్పించండి..' ఎందుకంటే నేను కూడా 'నా కుమార్తెకు ఎముకలు విరగ్గొట్టడం నేర్పించబోతున్నాను..' అంటూ ఇన్ స్టా స్టోరీస్‌లో  పోస్ట్ పెట్టింది. దీనికి బ్యాక్ గ్రౌండ్‌లో కరాటే నేర్పిస్తున్న ఫొటో ను జత చేసింది. ప్రస్తుతం రేణూ దేశాయ్ షేర్ చేసిన పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. అభిమానులు, నెటిజన్లు రేణు నిర్ణయాన్ని ప్రశంసిస్తున్నారు. 'గుడ్ డెసిషన్ మేడమ్' అంటూ కామెంట్స్ చేస్తున్నారు.